క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు

నంద్యాల(అర్బన్): కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజల కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. చల్లని నీరు ప్రజలకు అందివ్వాలన్న లక్ష్యంతోనే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ షాను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన హుండీ ఆదాయం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీ ఆంజనేయ కోదండ రామ స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. కార్యనిర్వహణాధికారి మూలసాగరం గోపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ లెక్కింపులో దేవస్థానానికి రూ.5,27,386 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి జి. వేణునాథ రెడ్డి తెలిపారు. గతంలో కంటే ఈ సారి రూ. 26,520 ఆదాయం తగ్గినట్లు ఈఓ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి వీఆర్‌ఓ మురళీ, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ అకౌంట్ ఆఫీసర్ రమ్య, ఆలయ చైర్మన్ చెన్న వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు యాడికి శ్రీదేవి, మహిళా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది, పూజర్లు పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ కూలీల సంఖ్య పెంచాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఎలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలానికి లక్ష్యంగా ఇచ్చిన పనిదినాలు 1,56,918 కాగా 1,58,884 పనిదినాలు కల్పించడం జరిగిందన్నారు. 1.25 శాతం అదనంగా పని దినాలు కల్పించామన్నారు. ఫారంపండ్స్ టార్గెట్ 14 కాగా ఈ నెల చివరిలోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కేఎస్ఏటీలో శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్టు (కేఎస్ఏటీ)ల్లో శాంతినికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారని చైర్మన్ సుధాకర్ బుధవారం తెలిపారు. క్రాంతినగర్‌లోని శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 9వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు, 6వ తరగతి విద్యార్థి కార్తీక్ రెండో ర్యాంకు సాధించారన్నారు. వారిని అభినందిస్తూ మెమొంటోలు, మెడల్స్‌తో పాటు రూ.2 వేల నగదు అందజేశారు.

'విజయ డెయిరీ చైర్మన్‌ను మారుస్తాం'

నంద్యాల(అర్బన్): అధికారపార్టీలో కానీ.. ప్రభుత్వంలో కానీ.. ఎలాంటి హోదా, పదవీ లేకపోయినా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ తమ్ముడు జగత్ విఖ్యాత్‌రెడ్డి అధికార దర్పం ప్రదర్శిస్తున్నాడు. ప్రోటోకాల్ పాటించకుండా మాట్లాడుతున్న మాటలు టీడీపీ సీనియర్ నేతలను సైతం కలవరపెడుతున్నాయి. మొన్న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. తాజాగా బుధవారం నంద్యాలకు వచ్చిన ఆయన విజయడెయిరీ చైర్మన్‌ను మారుస్తామంటూ ప్రకటించారు. ఏ పదవి లేకపోయినా ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై ఆ పార్టీ సీనియర్ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ పని కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

చాగలమర్రి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులను అడిగిన వారందరికీ కల్పించాలని ఏపీడీ సాంబశివరావు ఆదేశించారు. ఆయన బుధవారం చాగలమర్రిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి నిర్దేశించిన 3,200 మంది కూలీలకు గాను 2200 మంది మాత్రమే పని చేస్తున్నారని, ఈ సంఖ్యను పెంచాలని ఎఫ్ఏ, టీఏలకు ఆదేశించారు. మండలానికి మంజూరైన 74 ఇంకుడు గుంతలను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అభివృద్ధి చేయటానికి అవకాశమున్న శ్మశానాలను గుర్తించాలన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల: పరిశ్రమల్లో నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశ్రమల యాజమాన్యాలను సూచించారు. దీని వల్ల ఆకస్మిక ప్రమాదాలను సులువుగా ఎదుర్కోవచ్చునన్నారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జేసీ డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించే సమయంలో సంబంధిత అధికారులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో ఏవైనా చిన్న లోపాల వల్ల ఆన్ సైట్‌లో ఏర్పడిన ప్రమాదాన్ని అక్కడే నివారించి ఆఫ్ సైట్‌లోకి ప్రమాదం వ్యాపించకుండా తప్పనిసరి చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే ఏవైనా అనుకొని ప్రమాదాలు జరిగినప్పుడు వాటి నుంచి ఏ విధంగా బయట పడాలో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎలాంటి పరిశ్రమలు ఉన్నాయి, ఏ విధమైన రసాయనాలు తయారు చేస్తారనే అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో కాలం చెల్లిన అగ్నిమాపక పరికరాలను వినియోగించకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఆకస్మాత్తు ప్రమాదాలు జరిగినప్పుడు ఆటో అలారం, వర్క్ పర్మిట్ సిస్టమ్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల సమయంలో అధికారులు తక్షణమే స్పందించి నష్టాన్ని నివారించాలన్నారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలో నేషనల్ సేఫ్టీ డేలో భాగంగా మార్చి 4 నుంచి 10వ తేది వరకు నేషనల్ సెక్యూరిటీ వీక్ వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల చుట్టు ఉన్న పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు భద్రతా ప్రమాణాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ప్రమాద నివారణలో భాగంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం భోపాల్ గ్యాస్ ప్రమాదం ఏ విధంగా జరిగింది, పరిశ్రమల యాజమాన్యాలు పాటించని నియమ నిబంధనలు ఏంటి ? అధికారులు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలకు సంబంధించిన వీడియో ప్రదర్శించారు. జిల్లాలో ఉన్న భారీ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పరిశ్రమల యాజమాన్యాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారి బాలరాజు, ఎస్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాలు తనిఖీ

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మనోహర్‌రెడ్డి, మధుసుధాకర్ తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 255 మంది విద్యార్థులకు గాను నలుగురు, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 247 మంది విద్యార్థులకు గాను ముగ్గురు, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 235 మంది విద్యార్థులకు గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పర్యవేక్షకులు అనురాధ, న్యామతుల్లా తెలిపారు.

రెండో రోజు ప్రశాంతం

దొర్నిపాడు:పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండో పరీక్ష హిందీ బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివలక్ష్మి తెలిపారు. 181 మంది రెగ్యులర్ విద్యార్థులకు అందరూ హాజరు కాగా నలుగురు ప్రైవేటు విద్యార్థులకు గాను ఒక్కరే హాజరైనట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ సుభద్ర పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు సంబంధించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ రాచంద్రయ్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కొన ఊపిరితో ఉన్న బాలికలను గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): మహానంది వసతి గృహం కూల్చివేతలో మృతి చెందిన రాముడు, వెంకటేశ్వర్ల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రుడు, మహానంది మండల కార్యదర్శి బాలవెంకట్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్ద దిక్కు అయినా రాముడు, వెంకటేశ్వర్లు మృతితో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఇటీవలనే వెంకటేశ్వర్లు భార్య కూడా చనిపోయిందని, ఆయనకున్న ముగ్గురు పిల్లలు అనాథలుగా మారే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మృతుల కుటుంబాలను ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్టర్లు పనులు జరిగే చోట కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేసి ఉంటే ఇలా జరిగేది కాదన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఆళ్లగడ్డ: చెడు వ్యసనాలకు బానిసలై శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆయన కోటకందుకూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ ఎవరైనా ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత ఇటీవల కాలంలో ఆన్‌లైన్ గేమ్స్, రుణాలు పొంది వాటిని తిరిగి కట్టలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వారిపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. పిల్లల అలవాట్లను గమనిస్తుండాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎవరైనా మట్కా, పేకాట, బెల్టుషాపులు నిర్వహిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డుప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మలసత్రం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రమాదాలపై అవగా


గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ

హన పెంచేందుకు ఆటోకు ఎల్ఈడీ టీవీ అమర్చి ప్రదర్శించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రమాదాలు అధికంగా వాహనదారుల నిర్లక్ష్యంతో జరుగుతాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి తరలించటం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం అధికంగా ఉంటుందన్నారు. యువకులు వేగంగా వాహనాలు నడిపి ఎదుటి వారి ప్రాణాలు రిస్క్‌లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పదవ తరగతి మూల్యాంకనంలో మినహాయింపు ఇవ్వాలి


డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మాధ్యమిక విద్య పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనంలో మినహాయింపు ఇవ్వాలని, అలాగే డీఎస్సీ ఉపాధ్యాయుల 5 రోజుల వేతనం చెల్లించాలని కోరుతూ బుధవారం డీఈఓ జనార్దన్‌రెడ్డికి ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఉపాధ్యాయులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే డీఎస్సీ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు, 2024 వేసవి సెలవుల్లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులకు వేతనం చెల్లించాలని కోరారు. డీఎస్సీ 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏటీఎఫ్ నాయకులు సాంబశివుడు, శ్రీనివాసులు, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

రుద్రవరం: మండలంలో బుధవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మోటర్ సైకిళ్ల ప్రమాదాల్లో ఇద్దరు, విద్యుత్ ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు.మండల పరిధిలోని కోటకొండ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో రైతులకు సంబంధించి విద్యుత్ సమస్య తలెత్తింది. విషయాన్ని లైన్‌మెన్ మల్లయ్యకు తెలపగా తాను అందుబాటులో లేనని ప్రైవేటు వ్యక్తులైన మాధవ, రాజు అనే ఇద్దరిని పురమాయించాడు.వారు పనులు చేసేందుకు ఎల్లావత్తుల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి అనుమతులు తీసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు ఇద్దరిలో ఒకరు స్తంభం పై భాగాన, ఇంకొకరు కింది భాగాన ఉండి మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో ఆ ఇద్దరు విద్యుత్ షాక్‌కు గురై గాయ పడ్డారు. అలాగే ఆళ్లగడ్డ మండలం ఆర్.క్రిష్ణాపురానికి చెందిన లక్ష్మీదేవి ఆలమూరులో బ్యాంకు పనులు ముగించుకొని మోటర్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ప్రమాద వశాత్తు అదుపు తప్పి కింద పడింది. ఈ ఘటనలో ఆమె తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మండల కేంద్రమైన రుద్రవరం పడమటి వీధికి చెందిన వుశేన్‌వలి మోటర్ సైకిల్‌పై కొండమాయపల్లె వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాద వశాత్తు అదుపు తప్పి కింద పడటంతో గాయాలయ్యాయి .క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బ్యాంకుల్లో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. గత ఏడాది మార్చిలో నిర్వహించిన ద్వైపాక్షిక సమావేశంలో ఇచ్చిన హామీలను 180 రోజుల్లో అమలు చేయకపోవడం సరికాదన్నారు. అన్ని ఆర్థిక సంస్థల్లో 5 రోజుల పనిదినాల పని విధానం కొనసాగుతుందన్నారు. బ్యాంకుల్లో మాత్రం ఇది జరగడం లేదన్నారు. ఖాళీ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేయడం తగదన్నారు. ఉద్యోగ నియామకాలు లేనందున పని ఒత్తిడి పెరిగి బ్యాంకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాలవెంకట్, మహమ్మద్‌గౌస్, సేబారాణి, నిర్మల, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొందరికే రేషన్

- ఆందోళనలో చాకరాజువేముల గ్రామస్తులు
- 540 కుటుంబాలకు గాను 82 కుటుంబాలకే పంపిణీ
- ఉగాది, రంజాన్ పండుగలు ఎలా చేసుకోవాలని ప్రశ్నిస్తున్న కార్డుదారులు
- 19వ రేషన్ షాప్ సీజ్ చేయడంతోనే ఈ పరిస్థితి

దొర్నిపాడు: ఉగాది, రంజాన్ పండుగల సమయంలో చాకరాజువేముల గ్రామంలో రేషన్‌కార్డు దారులకు సరుకులు అందని పరిస్థితి. ఈ గ్రామంలో 19వ రేషన్ షాపు పరిధిలో మొత్తం 540 రేషన్‌కార్డులు ఉన్నాయి. కేవలం 82 మంది లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేసి మిగతా వారికి ఆకలి మిగిల్చారు. అసలేం జరిగిందంటే. 19వ రేషన్ దుకాణం మోహన్ రేషన్ డీలర్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. రాజకీయ నాయకులు ఒత్తిళ్లతో ఈనెల 5న చిన్న చిన్న లోపాలను సాకుగా చూపి డీటీ మాధవ్, తహసీల్దార్ సుభద్ర షాపును సీజ్ చేసి ఉన్న స్టాకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఊరంతా రేషన్ పంపిణీ అయినప్పటికీ 19వ షాప్ పరిధిలోని లబ్ధిదారులకు రేషన్ నిలిచి పోయింది. తిరిగి పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతులు ఈనెల 17న వచ్చాయి. అధికారులు హడావుడిగా రాత్రి 8.30 గంటలకు పంపిణీ మొదలు పెట్టారు. దీంతో 82 మందికి పంపిణీ చేసేలోపే రేషన్ పంపిణీ సమయం క్లోజ్ అయిందంటూ సైట్ పనిచేయలేదు. అధికారుల నిర్లక్ష్యానికి 458 మంది లబ్ధిదారులు రేషన్ అందక కడుపు మాడ్చుకోవాల్సి వచ్చింది. పండుగల సమయంలో మీ రాజకీయాల కోసం మమ్మల్ని పస్తులు పెడతారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేనెల మాకు రెండు నెలల కోటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి రేషన్ పంపిణీకి అనుమతులు చివరి రోజు రావడంతో రేషన్ కొందరికే పంపిణీ చేయాల్సి వచ్చిందని డిప్యూటీ తహసీల్దార్ మాధవ్ వివరణ ఇచ్చారు. వెంటనే సైట్ పనిచేయక పోవడంతో పంపిణీ నిలిపివేశామని చెప్పుకొచ్చారు.


పంపిణీ చేయక పోవడంతో దుకాణంలో నిల్వ ఉన్న బియ్యం, చక్కెర

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


కానాలలో పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి కిరణ్ కుమార్

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రెండవ అదనపు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీలక్ష్మి కర్రీ విద్యార్థులకు సూచించారు. బుధవారం నంద్యాల మండలం కానాల హైస్కూల్, చాబోలు సచివాలయంలో మండల న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంతో పాటు వివిధ చట్టాలపై గ్రామ ప్రజలకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేసి కేసుల పాలైతే ఉద్యోగాలు రావని తెలిపారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ కు సంబంధించిన చట్టాలు, శిక్షలను వివరించారు. గొడవలు, అనవసర విషయాలు, వ్యసనాల జోలికి వెళ్లకుండా.. జీవితాలను అందంగా మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల లీగల్ సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులతో ఈద్గాలో మౌలిక వసతులు

ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో ముస్లింలు ప్రార్థన చేసుకునే ఈద్గా వద్ద మౌళిక వసతుల కల్పనకు మండల పరిషత్ నిధులతో పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఈద్గా వద్ద జరుగుతున్న పనులను పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సోమవారం జిల్లా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి సబిహా పర్వీన్ ఈద్గాను సందర్శించిన సమయంలో ముస్లింలు ఈద్గా వద్ద నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో మండల పరిషత్ నిధుల నుంచి రూ. 50 వేలు వ్యయం చేసి ఈద్గా ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించి, గుంతలు పూడ్చేందుకు ఇసుక తరలించామన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా వద్ద పనులు వేగవంతం చేయనున్నట్లు స్పష్టం చేశారు.


ఉయ్యాలవాడ ఈద్గా వద్ద పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

వేసవి దుక్కులతో భూమి సారవంతం


రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: వేసవిలో లోతు దుక్కులు చేస్తే కలుపు మొక్కలు, చీడపీడల నివారణతో పాటు భూమి సారవంతమవుతుందని ఏఓ రంగనేతాజి అన్నారు. బుధవారం మండలంలోని గోడిగనూరు, డి.వనిపెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన రైతు విశిష్ట సంఖ్య ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు ఎంతో ప్రయోజనం


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి

గోస్పాడు: రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల ఉద్యాన అధికారి శ్రీధర్, స్థానిక ఏఓ స్వప్నికారెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో బుధవారం పతంజలి ఫుడ్ లిమిటెడ్స్, ఉద్యాన శాఖ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ స్కీం ద్వారా సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ఈ పంట సాగు చేసుకునే రైతులకు ఎకరాకు 57 మొక్కలను ఉచితంగా అందిస్తారన్నారు. ఎరువులు తదితర వాటికి హెక్టారుకు ఏడాదికి రూ.10,500 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇస్తారన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు వేసుకోవడం ద్వారా నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుందని, 25 సంవత్సరాల పాటు ఇది కొనసాగుతుందన్నారు. ఎకరాపై ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. ఈ పంట సాగుకు నీటి వసతి కలిగి ఉండాలని, ఆసక్తి గల రైతులు తమ గ్రామంలోని ఆర్‌ఎస్‌కేను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయాధికారి ప్రభావతమ్మ, పతంజలి జిల్లా మేనేజర్ మహాదేవయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.